పునరావృతం కాకుండా చూడాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వైద్య వృత్తిలో ఉన్న మహిళలకే రక్షణ కరువైతే మహిళల్లో అభద్రతాభావం పెరిగే ప్రమాదం ఉంది. మరొకరు ఇలాంటి చర్యలకు పాల్పడాలంటే భయపడేలా నిందితులకు శిక్ష అమలు చేయాలి.

– డాక్టర్ పి.కావ్య, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి

మహిళా డాక్టర్లకు భద్రత అవసరం



మహిళా డాక్టర్లు రేయింబవళ్లు అత్యవసర కేసులకు హాజరు కావల్సి ఉంటుంది. కోల్‌కతా ఘటన వల్ల మహిళా డాక్టర్లు రాత్రి వేళల్లో విధులకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించడం ద్వారా వారిలో ధైర్యం పెంపొందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

– డాక్టర్ డి.జనార్ధన్, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి

కఠినంగా శిక్షించాలి



ప్రజల ప్రాణాలను రక్షించే వైద్యులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉంది. కోల్‌కతా ఉదంతం జరిగాక దేశమంతా స్పందించింది. మహిళలపై దారుణాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు తగ్గుతాయి.

– ఇ.స్వర్ణలత, స్టాఫ్‌నర్స్, యల్లాయపాళెం పీహెచ్‌సీ



క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా విద్యార్థులకు సూచించారు. వెంకటేశ్వరపురంలోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మైనర్ డ్రైవింగ్, సైబర్ నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, మహిళల రక్షణ చట్టాలు తదితరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల యజమానులు బాధ్యతగా ఉండాలి



నెల్లూరు(బారకాసు) : ప్రధాన రోడ్లపై పశువులు సంచరించకుండా వాటి యజమానులు బాధ్యత తీసుకోవాలని, లేకుంటే వాటిని గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. స్థానిక నవాబుపేట, పొదలకూరు రోడ్డు, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న 11 పశువులను కల్లూరుపల్లి గోశాలకు గురువారం తరలించారు. పశువులను యజమానులు వారి ఇళ్ల ప్రాంగణాల్లోనే ఉంచుకోవాలని సూచించారు.

నేత్రదానంపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేత్రదానంపై గురువారం అవగాహన కల్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బ్లాక్ బోర్డు మిత్ర మండలి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శర్వాణి మాట్లాడారు. నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు ప్రసాదించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామప్రసాద్, జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, ప్రసాద్, శ్రీనివాసులు, రామదాసు పాల్గొన్నారు.

పీడబ్ల్యూఏ సిటీ కన్వీనర్‌గా స్వరూప్‌కుమార్

నెల్లూరు(బృందావనం) : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర కన్వీనర్‌గా బ్రదర్ స్వరూప్‌కుమార్ నియమితులయ్యారు. నగర పరిధిలో పాస్టర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన గురువారం తెలిపారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ నాయకులకు సన్మానం

నెల్లూరు(అర్బన్) : స్థానిక సంతపేటలో ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నున్నా హరిప్రసాద్, బట్టేపాటి అశోక్, కోశాధికారిగా ఆరోగ్యమేరీ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బీబీజాన్, వైస్ ప్రెసిడెంట్లుగా రమేష్, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సునీతలను, జిల్లా జాయింట్ సెక్రటరీలుగా చంద్రశేఖర్, ఉమర్, సుభాషిణిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి చేజర్ల సుధాకర్‌రావు అభినందనలు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ పీఓ రమణకు సీపీఐ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, నాయకులు షబ్బీర్, షాకీర్, మస్తాన్, పాల్గొన్నారు.

గిడుగుతో తెలుగు భాషకు వన్నె

• మెప్మా పీడీ రవీంద్ర



తరిమెల నాగిరెడ్డి పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించిన మెప్మా పీడీ, ఇతర సిబ్బంది



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(బారకాసు) : తెలుగు భాషకు వన్నె తెచ్చిన ఘనుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని మెప్మా పీడీ రవీంద్ర తెలిపారు. నగరంలోని సుబేదారుపేటలో ఉన్న మెప్మా కార్యాలయంలో తెలుగు భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి జయంతిని గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు అని తెలిపారు. కొద్ది మందికి పరిమితమైన చదువును అందరికీ అందించిన తెలుగు భాషా పితామహుడని కొనియాడారు. ఆనాడే అడవుల్లోని గిరిజన తెగలకు విద్య అందించాలనే కోరికతో గిడుగు సవర భాషను నేర్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి సుధాకర్, ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, బీఎల్ సురేంద్ర, హెచ్ఎస్ హర్షిత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెలుగు చరిత్ర చాలా గొప్పదని, తెలుగు భాషను రక్షించుకోవాలన్న కాంక్ష పెరిగినప్పుడే పది కాలాల పాటు గొప్పగా ఉంటుందన్నారు. డాక్టర్ కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ తెలుగు వారు ఎప్పటికీ మరిచిపోని వారిలో గిడుగు రామ్మూర్తి ఒకరన్నారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన గీతాలు, చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పెరుగు రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ గిరి, తెలుగు అధ్యాపకులు కరుణశ్రీ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక సంఘమిత్ర హైస్కూల్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపన్యాస, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం సుచిత్ర, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, కోశాధికారి నజ్మా, నిర్వాహకాలు భారతి పాల్గొన్నారు.

➡ మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి ఎస్సార్కే స్కూల్‌లో విద్యార్థులు తెలుగు గేయాలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కవి పెరుగు రామకృష్ణ, స్కూల్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురాం పాల్గొన్నారు.

➡ స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు పులి చెంచయ్య, సుధీర్, శ్రీనివాసులు, మునిరాజా, రవికృష్ణ పాల్గొన్నారు.

➡ కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్ పాల్గొన్నారు.

➡ సరస్వతీనగర్‌లోని డాక్టర్ కిశోర్స్ రత్నం స్కూల్‌లో శ్రీకృష్ణదేవరాయులు, తెలుగు కవులు, అల్లూరి సీతారామరాజు తదితరుల వేషధారణలతో విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. రత్నం విద్యాసంస్థల జీఎం రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్స్ మణిమాల, ప్రపూర్ణ పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో..

నెల్లూరు(దర్గామిట్ట) : స్థానిక జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ, డిప్యూటీ సీఈఓతో కలిసి గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, అధికారులు, సిబ్బంది గిడుగు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

డీసీఓ కార్యాలయంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ప్రాముఖ్యతను డీసీఓ గుర్రప్ప వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు రసూల్‌ఖాన్, గాయత్రి పాల్గొన్నారు.

➡ నగరంలోని తరిమెల నాగిరెడ్డి పాఠశాలలో తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి జిల్లా కార్యదర్శి కొండమ్మ, ఉపాధ్యాయులు శిల్ప, సల్మ, శ్రీ.లక్ష్మి, కృష్ణప్రసాద్, విజయమ్మ, స్వప్న పాల్గొన్నారు.

➡ నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని పొట్టేపాళెంలో టీడీఆర్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు రమేష్ కుమార్, సురేష్‌కుమార్, రాజేశ్వరరావు, హుస్సేన్, మురళీ పాల్గొన్నారు.



డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..



సంఘమిత్ర స్కూల్‌లో..



మున్సిపల్ స్కూల్‌లో..



డీసీఓ కార్యాలయంలో..

గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

నెల్లూరు(క్రైమ్) : వినాయక చవితి పండగ సందర్భంగా స్టేషన్ పరిధిలో మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతులు తప్పనిసరి అని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా మండపాలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్లాస్టిక్ పట్ట తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : లక్ష్మీపురంలో విద్యుత్ లైన్లపై పడిన ప్లాస్టిక్ పట్టను విద్యుత్ సిబ్బంది గురువారం తొలగించారు. సాక్షి దినపత్రికలో 'నిర్లక్ష్యంగా వదిలేస్తే ఎలా' అనే శీర్షికన విద్యుత్ వైర్లపై పడిన ప్లాస్టిక్ పట్ట గురించి వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై విద్యుత్‌శాఖ నెల్లూరు టౌన్–2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించి సిబ్బందితో ప్లాస్టిక్ పట్టను తొలగింపజేశారు.

త్రుటిలో తప్పిన ఫ్లెక్సీ ప్రమాదం



రోడ్డుపై పడిన ఫ్లెక్సీ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని మినీబైపాస్‌రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ఓ పెద్ద ఫ్లెక్సీ గాలికి పడిపోయింది. అయితే ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎంపీ వేమిరెడ్డి ఇంటి ముందు, ఎదురుగా, సమీపంలో అనేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ క్రమంలోనే ఓ ఆటో ఎంపీ ఇంటి వద్దకు వచ్చే సమీపంలో పెద్ద ఫ్లెక్సీ ఉన్నఫలంగా గాలికి పడిపోయింది. అయితే ఆటో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది.

ఖలీల్‌కు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



ఖలీల్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అనిల్



ఖలీల్‌అహ్మద్‌ను పరామర్శిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్‌ను మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ గురువారం పరామర్శించారు. అనంతరం చికిత్సకు సంబంధించిన అంశాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

➡ నెల్లూరు(బారకాసు) : మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్‌ను నగర మేయర్ స్రవంతి గురువారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

1న దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సు

నెల్లూరు(బారకాసు) : ఆదివాసీ పోరాటాలకు సంఘీభావంగా నగరంలోని టౌన్‌హాల్‌లో సెప్టెంబర్ 1న దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారని, ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సదస్సు ఆహ్వాన సంఘ అధ్యక్షుడు జి.మాల్యాద్రి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. మధ్యభారతం, మణిపూర్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. దీనిని అడ్డుకునే ఆదివాసులపై దాడులకు పాల్పడుతున్నారని, ఒక మధ్య భారతంలోనే జనవరి నుంచి నేటి వరకు 200 మందికిపైగా ఆదివాసులు, ఉద్యమకారులను చంపేశారన్నారు. అంతకు ముందు పోస్టర్లు, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆ వేదిక రాష్ట్ర కో–కన్వీనర్ బాబు, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, అబ్బాయిరెడ్డి, బ్రహ్మం, శివశంకర్, రాంబాబు, ఎల్లంకి వెంకటేశ్వర్లు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ఎఫ్‌డీఐలకు వ్యతిరేకంగా ఆందోళన

నెల్లూరు(అర్బన్) : ఎల్ఐసీలో వంద శాతం విదేశీ, ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలోని అన్ని ఎల్ఐసీ బ్రాంచ్‌ల వద్ద ఏఓఐ (ఏజెంట్స్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. నగరంలోని బృందావనం ఎల్ఐసీ బ్రాంచి వద్ద జరిగిన ధర్నాలో ఏఓఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్ మాట్లాడుతూ అంచెలంచెలుగా ఎల్ఐసీని ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. ప్రస్తుతం వంద శాతం ఎఫ్‌డీఐలను అనుమతించేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర నాయకులు సెల్వరాజ్, మేకల నరసింహారావు యాదవ్, ఎస్.నరసింహులు, ఎం.నరసింహరాజు, హజరత్‌రెడ్డి, రంగారావు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించండి



నెల్లూరు(బృందావనం) : జిల్లాలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసరావును కోరినట్లు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బారకాసు సెంటర్‌లోని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు వివరించారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను క్రైస్తవులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు ఐఎస్ బెన్హర్‌బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, కోశాధికారి కిశోర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెం గాంధీనగర్‌లో ఉన్న కృష్ణ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. కరిమద్దెల నరసింహారెడ్డి శ్రీకృష్ణతత్వంపై ఉపన్యసించారు. కార్యక్రమాల్లో ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు, మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీ రాఘవేంద్ర, ఎస్.సుబ్బరామరాజు, ఉపాధ్యక్షుడు ఎస్.వేణుబాబు, ఎం.లక్ష్మీ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం



క్రీడాకారులను సన్మానించిన అధికారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు వేడుకలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్, సెట్నల్ సీఈఓ వెంకటయ్య, ఎన్‌వైకే జిల్లా కో–ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్ రెడ్డి, కార్యదర్శి కె.గురుప్రసాద్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో..

సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై, క్రీడా దినోత్సవ విశిష్టతను వివరించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్, పీడీ రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రన్ ఫర్ ఫిట్‌నెస్

నెల్లూరు (టౌన్) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ఎన్‌సీసీ క్యాడెట్లు రన్ ఫర్ ఫిట్‌నెస్ పరుగు పందేన్ని గురువారం నిర్వహించారు. కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు నరేంద్రబాబు, నాగరాజు పాల్గొన్నారు.



పరుగు పందెంలో ఎన్‌సీసీ క్యాడెట్లు



బీఈడీ కళాశాలలో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్, డీఎస్డీఓ, పీడీ

క్రీడలపై ఆసక్తి చూపాలి



అవార్డులు అందుకున్న పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్) : విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా ఆసక్తిని పెంపొందించాలని డీఈఓ పీవీజే రామారావు తెలిపారు. దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో పతకాలు సాధించిన నగరంలోని కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్, బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్, పాటూరులోని జెడ్పీ హైస్కూల్, కోవూరులోని జెడ్పీ హైస్కూల్, మహ్మదాపురంలోని జెడ్పీ హైస్కూల్స్ హెడ్‌మాస్టర్లకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని పతకాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతల స్వీకరణ



నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ



సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి

నెల్లూరు(క్రైమ్) : నగర నార్త్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు కె.రామకృష్ణ, కె.వెంకటరెడ్డి గురువారం వారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ రేంజ్ కార్యాలయానికి, సౌత్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రోశయ్య నెల్లూరు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. దీంతో రేంజ్ కార్యాలయంలో ఉన్న రామకృష్ణను నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, కృష్ణపట్నం పోర్టు ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డిని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రామకృష్ణ, వెంకటరెడ్డి నార్త్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లుగా బాధ్యతలు స్వీకరించారు. వారికి సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ జి.కృష్ణకాంత్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్యల సలహాలు, సూచనలు పాటిస్తూ నగర వాసులకు మెరుగైన ట్రాఫిక్‌ను అందిస్తామన్నారు. అనంతరం నూతన ఇన్‌స్పెక్టర్‌లకు ఎస్సై గీతారమ్య, ఆర్ఎస్సైలు నాగరాజు, చంద్రమౌళి, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రామకృష్ణ, వెంకటరెడ్డి జిల్లాకు సుపరిచితులే.